క్లుప్తంగా

పారిజాతగిరిలో విశేష పూజలు



విశేషాలంకరణలో శ్రీవేంకటేశ్వరస్వామి

జంగారెడ్డిగూడెం: స్థానిక గోకుల తిరుమల పారిజాత గిరి శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారంలో విశేష పూజలు నిర్వహించారు. సుప్రభాత సేవ, తోమాల సేవ, ఆరాధన, తీర్థ ప్రసాద గోష్టి తదితర పూజలు ఆలయ అర్చకులు నల్లూరి రవికుమారాచార్యులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జంగారెడ్డిగూడెం పరిసర ప్రాంతాలతో పాటు కాలినడకన నిడదవోలు మండలం చిక్కాలపాలెం గ్రామానికి చెందిన భక్తులు పారిజాతగిరి చేరుకుని స్వామి వారిని దర్శించుకున్నారు. కార్యక్రమాలను ఈవో మానికల రాంబాబు పర్యవేక్షించారు.

గుండెపోటుతో వీఆర్వో మృతి



పుల్లారావు, వీఆర్వో (ఫైల్)

టి.నరసాపురం: టి.నరసాపురం-2 వీఆర్వో హెచ్చు పుల్లారావు (48) గుండెపోటుతో మృతి చెందారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం కె.జగ్గవరంలో నివాసం ఉంటున్న పుల్లారావు శనివారం తెల్లవారుజామున అస్వస్థతకు గురికావడంతో కుటుంబసభ్యులు చింతలపూడి ప్రైవేటు ఆసుపత్రికి తీసుకువెళ్లారు. అప్పటికే మృతి చెందినట్టు డాక్టర్ నిర్ధారించారు. ఆయన స్వగ్రామం కె జగ్గవరంలో అంత్యక్రియలు నిర్వహించారు. తహసీల్దార్ సుభాష్ సిబ్బందితో వచ్చి పుల్లారావు భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పుల్లారావుకు భార్య, ఇద్దరు సంతానం ఉన్నారు.

పాలిసెట్ ఉచిత శిక్షణ

జంగారెడ్డిగూడెం: రాష్ట్ర సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ సి.నాగరాణి ఆదేశాల మేరకు 2024 పాలిసెట్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు జంగారెడ్డిగూడెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏప్రిల్ 1 నుంచి 25 వరకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ పి.సుబ్రహ్మణ్యం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవచ్చన్నారు. వివరాలకు 93816 66859, 90102 22162 నంబర్లలోగాని, కళాశాలలో గాని సంప్రదించాలన్నారు.

బస్టాండ్‌లోని మరుగుదొడ్లకు నీటి సౌకర్యం కల్పించాలి

ద్వారకాతిరుమల: మండలంలోని ద్వారకానగర్ పరిధిలో, భీమడోలు జంక్షన్‌కు ఆనుకుని ఉన్న ద్వారకాతిరుమల శ్రీవారి దేవస్థానం బస్టాండ్‌లో నీటి ఎద్దడి కారణంగా మరుగుదొడ్లకు తాళాలు పడ్డాయి. దాంతో గత కొద్దిరోజులుగా క్షేత్రానికి వచ్చే భక్తులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. తాజాగా శనివారం మరుగుదొడ్ల వద్ద వాటర్ లేదు అనే సూచిక బోర్డును ఏర్పాటు చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, పాడైపోయిన బోరుకు మరమ్మతులు చేయించి, మరుగుదొడ్లకు నీటి సరఫరాను పునరుద్ధరించాలని పలువురు కోరుతున్నారు. దీనిపై ఏలూరు జిల్లా సీఐటీయూ అధ్యక్షుడు ఆర్ లింగరాజు మాట్లాడుతూ సమస్యను దేవస్థానం, ఆర్టీసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లామని త్వరలోనే సమస్య పరిష్కారం అవుతుందని అధికారులు హామీ ఇచ్చినట్టు తెలిపారు.

సంక్షేమ పాలన కోసం ఫ్యాన్ గుర్తుకు ఓటేయండి

- పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, ఎమ్మెల్యే అభ్యర్థి రాజ్యలక్ష్మి
- వేలేరుపాడు మండలంలో విస్తృతంగా ఎన్నికల ప్రచారం



కమ్మరిగూడెం పెదవాగు వద్ద ఎన్నికలకు సిద్ధం అంటున్న ఎమ్మెల్యే బాలరాజు, పోలవరం ఎమ్మెల్యే అభ్యర్థి తెల్లం రాజ్యలక్ష్మి, వైఎస్సార్ సీపీ నేతలు



రచ్చబండ వద్ద గిరిజనులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలరాజు, పోలవరం ఎమ్మెల్యే అభ్యర్థి తెల్లం రాజ్యలక్ష్మి, పార్టీ శ్రేణులు

వేలేరుపాడు: రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమ పాలన కొనసాగాలంటే ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, ఆ పార్టీ అభ్యర్థి తెల్లం రాజ్యలక్ష్మి కోరారు. శనివారం వేలేరుపాడు మండలంలోని మేడేపల్లి, కమ్మరిగూడెం, గుళ్ళవాయి, సోందేగొల్లగూడెం, వసంతవాడ, గుంపెనగూడెం, మద్దిగట్ల, పోచారం, రుద్రమకోట తదితర గ్రామాల్లో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి గురించి వివరించారు. సార్వత్రిక ఎన్నికల్లో మీ అమూల్యమైన రెండు ఓట్లను ఫ్యాన్ గుర్తుకు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు సంతోషంగా ఉండాలన్న సంకల్పంతో అహర్నిశలు కృషి చేసే వ్యక్తి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. ప్రతి మహిళా ఆర్థికంగా ఎదగాలన్నదే ఆయన ధ్యేయమని, అందుకే ఏ పథకం చేపట్టినా మహిళల పేరుతో అందిస్తున్నారన్నారు. ఎన్నికల ముందు పాదయాత్రలో జగనన్న ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించడమే ధ్యేయంగా కృషి చేస్తున్నారని అన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందుతున్నాయని కొనియాడారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో పింఛన్ల కోసం అవ్వ,తాతలు గంటల కొద్దీ క్యూలో నిలబడాల్సి వచ్చేదని అన్నారు. అంతేకాకుండా జన్మభూమి కమిటీలు, కిరికిరి కమిటీల పేరుతో పింఛన్ల మంజూరుకు నానా ఇబ్బందులు పెట్టేవారన్నారు. నేడు జగనన్న ప్రభుత్వ హయాంలో తెల్లవారక ముందే లబ్ధిదారుల ఇండ్ల తలుపులు తట్టి వలంటీర్లు పింఛన్లు అందజేస్తున్నారన్నారు. గతంలో రాష్ట్రంలో 39 లక్షల మందికే పింఛన్లు వచ్చేవని, నేడు రాష్ట్రంలో 69 లక్షల మందికి అందజేస్తున్న ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని అన్నారు.

బాలరాజు దంపతులకు బ్రహ్మరథం

వేలేరుపాడు మండలంలోని మేడేపల్లి, కమ్మరిగూడెం, గుళ్ళవాయి, సోందేగొల్లగూడెం, వసంతవాడ, గుంపెనగూడెం, మద్దిగట్ల, పోచారం, రుద్రమకోట తదితర గ్రామాల్లో పర్యటించిన ఎమ్మెల్యే బాలరాజు, ఆయన సతీమణి రాజ్యలక్ష్మిలకు ప్రజలు అడుగడుగునా బ్రహ్మరథం పట్టారు. ఆయా గ్రామాల్లో పూలమాలలు వేసి ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ వాళ్ళ లక్ష్మీదేవి, వైస్ ఎంపీపీ మేడవరపు నాగశ్రీ, కేసగాని వెంకటేశ్వరమ్మ, జెడ్పీటీసీ గుజ్జా రామలక్ష్మి, సర్పంచ్‌లు కట్టి ఉదయ్‌కిరణ్, లక్ష్మణ్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కేసగాని శ్రీనివాసగౌడ్, కామినేని వెంకటేశ్వరరావు. గుద్దేటి భాస్కర్, ఎస్కే షౌకత్ హుస్సేన్, కొలూరి సత్తిరాజు, ఎండీ అఫ్రోజ్, చిన్ని, మెండెం కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బుట్టాయగూడెంలో కవాతు



బుట్టాయగూడెంలో సాయుధ దళాలు కవాతు చేస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జీలుగుమిల్లి సీఐ క్రాంతికుమార్, బుట్టాయగూడెం ఎస్సై కె.వెంకన్న, సిబ్బంది, సాయుధ దళాలతో కలిసి శనివారం మండలంలోని పలు గ్రామాల్లో ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ క్రాంతికుమార్ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు ఎటువంటి పక్షపాతం లేకుండా నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకునేలా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో వివిధ రకాల చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఎన్నికల నిబంధనలను ప్రజలు, రాజకీయ పార్టీల నేతలు తప్పక పాటించాలని అన్నారు. రూ.50 వేల కంటే ఎక్కువ నగదుతో ప్రయాణం చేసే సమయంలో సంబంధిత ధ్రువపత్రాలు తప్పనిసరి, లేనిపక్షంలో ఆ డబ్బును స్వాధీనం చేసుకోవడం జరుగుతుందని చెప్పారు. అలాగే ఎన్నికల పోలింగ్ సందర్భంగా ఎదుటివారి ఓటును వినియోగించుకునే విషయాల్లో ఆటంకాలు సృష్టించరాదని చెప్పారు. అలాగే ఫలానా పార్టీకే ఓటు వేయాలని బెదిరించడం లేదా ప్రలోభాలకు గురి చేయడం వంటి పనులు చేస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

ఏఎంసీ చైర్‌పర్సన్ జగ్గవరపు జానకిరెడ్డి



పట్టణ, మండల సచివాలయాల కన్వీనర్లుగా ఎంపికైన రాంబాబు, చెంచమరాజులను అభినందిస్తున్న జానకిరెడ్డి

చింతలపూడి: సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జగ్గవరపు జానకిరెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. స్థానిక ఏఎంసీ కార్యాలయంలో శనివారం మండల సచివాలయాల కన్వీనర్ ఎం.రాంబాబు, పట్టణ సచివాలయాల కన్వీనర్లుగా ఎంపికైన బి చెంచమరాజులను అభినందించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో జానకిరెడ్డి మాట్లాడుతూ సచివాలయాల పరిధిలో ఉన్న ప్రజలకు ప్రభుత్వం ఈ ఐదేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలను గురించి వివరించాలని అన్నారు. ఓటర్లను చైతన్య పరిచి ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేసేలా సచివాలయ కన్వీనర్లు పనిచేయాలని సూచించారు. చింతలపూడి ఎమ్మెల్యే అభ్యర్థిగా కె విజయరాజు, ఏలూరు ఎంపీగా కె.సునీల్‌కుమార్ యాదవ్‌లను అత్యధిక మెజార్టీతో గెలిపించి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కానుకగా ఇవ్వాలని కోరారు. మండల, పట్టణ సచివాలయ కన్వీనర్లుగా నియమితులైన ఎం రాంబాబు, బి చెంచమరాజు మాట్లాడుతూ తమపై నమ్మకంతో బాధ్యతాయుతమైన పదవుల్లో నియమించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, రీజనల్ కోర్డినేటర్ మిధున్‌రెడ్డి, ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్‌బాబు, జిల్లా అధ్యక్షుడు ఆళ్ళ నాని, చింతలపూడి నియోజకవర్గ ఇన్‌చార్జి కె విజయరాజులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి కె దినేష్‌రెడ్డి, విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి ఎస్ భరత్‌రెడ్డి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఇసుక రవాణాపై ఉక్కుపాదం



పోలీస్ స్టేషన్‌లో సీజ్ చేసిన ఇసుక ట్రాక్టర్లు

కొయ్యలగూడెం: ఇసుక అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా పెట్టినట్లు ఎస్సై జీజే విష్ణువర్ధన్ శనివారం పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఈనెల 29వ తేదీ రాత్రి గంగవరం సమీపంలోని ఎర్రకాలువ నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. పది రోజుల వ్యవధిలో ఇప్పటివరకు నాలుగు ట్రాక్టర్లను పట్టుకుని స్టేషన్‌కి తరలించినట్లు తెలిపారు. కాగా గంగవరంలో పట్టుకున్న ట్రాక్టర్‌కు సంబంధించి పోతిరెడ్డిపాలెంకి చెందిన ముంగమూరి వెంకటేశ్వరరావు అనే వ్యక్తిపై (వెంకన్న) కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

9న శ్రీవారి క్షేత్రంలో ఉగాది వేడుకలు

ద్వారకాతిరుమల: చినవెంకన్న దివ్యక్షేత్రంలో ఏప్రిల్ 9న శ్రీక్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్టు ఆలయ ఈఓ వేండ్ర త్రినాథరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీవారి ప్రధాన ఆలయంతో పాటు, ఉత్సవం నిర్వహించే ఉగాది మండపాన్ని ప్రత్యేకంగా అలంకరిస్తామన్నారు. ఆరోజు సాయంత్రం 6 గంటలకు స్వామివారు ఆలయం నుంచి ఉభయ దేవేరులతో కలిసి వెండి శేషవాహనంపై ఉగాది మండపం వద్దకు ఊరేగింపుగా తరలివెళతారన్నారు. అక్కడ పంచాంగ శ్రవణం తరువాత పండిత సత్కారం జరుగుతుందన్నారు. అనంతరం శ్రీవారికి గ్రామోత్సవాన్ని కన్నులపండువగా నిర్వహిస్తామన్నారు. కావున భక్తులు పెద్ద ఎత్తున ఈ వేడుకల్లో పాల్గొనాలని ఈఓ కోరారు.

క్షేత్రంలో పోటెత్తిన భక్తులు

శ్రీవారి దివ్య క్షేత్రంలో శనివారం భక్తులు పోటెత్తారు. స్వామివారికి ప్రీతికరమైన రోజు కావడంతో సుదూర ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తులు ఆలయానికి తరలివచ్చారు. దాంతో ఆలయ పరిసరాలు కళకళలాడాయి. తూర్పురాజగోపుర ప్రాంతంలోని వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌తో పాటు, దర్శనం క్యూలైన్లు, ప్రసాదం, టికెట్ కౌంటర్లు, కేశఖండనశాల ఇతర విభాగాలు భక్తులతో కిక్కిరిశాయి. ఆలయ ఆవరణలో పలు భజన మండలి సభ్యులు ప్రదర్శించిన కోలాట నృత్యాలు చూపరులను ఆకట్టుకున్నాయి. అలాగే ఆలయ అనివేటి మండపంలో పెద్ద ఎత్తున వివాహాలు జరిగాయి.

సంక్షేమంతోనే పేదల అభివృద్ధి సాధ్యం



జలపవారిగూడెంలో ప్రచారం నిర్వహిస్తున్న కేసరి సరితా రెడ్డి, వైఎస్సార్ సీపీ శ్రేణులు

కామవరపుకోట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమ పథకాలతోనే పేదలకు అభివృద్ధి సాధ్యమైందని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకురాలు, మద్ది ఆంజనేయస్వామి దేవస్థానం చైర్‌పర్సన్ కేసరి సరితా రెడ్డి అన్నారు. మండలంలో అంకాలంపాడు గ్రామపంచాయతీ జలపవారిగూడెంలో శనివారం గడపగడపకు వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పరిపాలన చేపట్టిన నాటినుంచి ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కుల, మత, రాజకీయాలకు అతీతంగా రాష్ట్రంలోని అర్హులైన ప్రతి ఒక్కరికీ మేలు జరిగే విధంగా సంక్షేమ పథకాలు అందించారన్నారు. దీంతో బడుగు, బలహీన, వర్గాల పేద ప్రజలు గతం కంటే సీఎం జగన్ పాలనలో ఆర్థికంగా అభివృద్ధి చెందారన్నారు. రానున్న రోజుల్లో రాష్ట్ర ప్రజలు మరింత ఆర్థిక అభివృద్ధిని సాధించాలన్నా, మేలు జరగాలన్న వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మరలా ముఖ్యమంత్రిని చేసే విధంగా ప్రతి ఒక్కరు ఫ్యాన్ గుర్తుకు ఓటు గెలిపించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చొక్కా స్వర్ణ, ఉప సర్పంచ్ కేసరి శ్రీహరి రెడ్డి, ఎంపీటీసీ గోరిక క్రాంతికుమారి, చంద్రమౌళి, నాగేశ్వరరావు దుర్గారావు, ప్రసాద్‌రెడ్డి, కృష్ణారెడ్డి, చొక్కా బాబురావు, కన్వీనర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

శ్రీవారి ఘాట్‌రోడ్డులో అదుపు తప్పిన కారు

ద్వారకాతిరుమల: శ్రీవారి కొండపైకి వెళ్లే ఘాట్ రోడ్డులో ఒక భక్తుడి కారు అదుపుతప్పి రోడ్డు మార్జిన్‌లోని బోదెలోకి దూసుకెళ్లింది. అయితే కారులో ఉన్న భక్తులు సురక్షితంగా బయటపడటంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. స్థానికుల కథనం ప్రకారం. చినవెంకన్న దర్శనార్థం హైదరాబాద్‌కు చెందిన ఒక భక్తుడు కుటుంబంతో కలసి స్విఫ్ట్ డిజైర్ కారులో క్షేత్రానికి విచ్చేశాడు. కొండపైన టోల్‌గేట్ దాటిన తరువాత కారు ఒక్కసారిగా అదుపుతప్పి వెనక్కి వెళ్లిపోయింది. డివైడర్ పై నుంచి దూసుకెళ్లి బోదెలో పడింది. ప్రమాదం జరిగిన సమయంలో అటుగా ఏవిధమైన వాహనాలు రాకపోవడంతో పాటు, కారులో ఉన్న వారికి ఏమీ కాకపోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. క్రేన్ సహాయంతో కారును బయటకు తీశారు.

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.లక్ష విరాళం



దాత బాలాజీరావుకు విరాళం బాండ్ పత్రాన్ని అందిస్తున్న ఆలయ ఏఈఓ

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఒక భక్తుడు శనివారం రూ. 1,00,116 విరాళంగా అందజేశారు. విజయవాడలోని పోరంకికి చెందిన కర్లపూడి బాలాజీరావు ముందుగా కుటుంబ సమేతంగా స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమచేశారు. ఈ సందర్భంగా దాతకు ఆలయ ఏఈఓ మెట్టపల్లి దుర్గారావు విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

రంగ్ పంచమి వేడుకలు

కొయ్యలగూడెం: కొయ్యలగూడెంలోని కన్నాపురం రోడ్డులో శనివారం రాత్రి రంగ్ పంచమి వేడుకలు నిర్వహించారు. ఒకే విధమైన వస్త్రధారణతో మహిళలు, యువతులు, బాలికలు ఒకరికొకరు పసుపు పారాణి అద్దుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఉత్తర భారతదేశంలో సంప్రదాయ వేడుకలలో హోలీ తరహాలో రంగ్ పంచమి వేడుకలు నిర్వహించుకోవడం ఆనవాయితీ అని వెల్లంకి సురేఖ తెలిపారు. అన్ని వర్గాల వారు ఇటువంటి వేడుకలు నిర్వహించుకోవడం స్ఫూర్తిదాయకం అని వైస్ ఎంపీపీ మట్టా వనజా లక్ష్మి పేర్కొన్నారు.